బెల్టు జోరు..కుటుంబాలు బేజారు

- పల్లెల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు
- మద్యం షాపునకు కాల్ చేస్తే బాయ్‌లు డెలివరీ
- బాటిల్‌కు రూ.20 అదనం
- బెల్టు దుకాణాల్లో రూ.50 అదనం
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు



జలదంకిలో మద్యం దుకాణం పక్కనే పట్టల చాటున నిర్వహిస్తున్న దాబా



బ్రాహ్మణక్రాకలోని దుకాణంలో మద్యం తాగుతున్న మందుబాబులు



బెల్టుషాపులకు బైక్‌పై మద్యం తరలిస్తున్న దృశ్యం

జలదంకి: కూటమి ప్రభుత్వం అండతో తెలుగు తమ్ముళ్లు దందాకు తెరతీసారు. ఎక్సైజ్ అధికారుల సహకారంతో ఊరూరా బెల్టు షాపులు నిర్వహిస్తూ ప్రజలను దోచుకుంటున్నారు. ప్రతి గ్రామంలో నాలుగు నుంచి ఐదు వరకు బెల్టు దుకాణాలను నడిపిస్తూ పేదల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నారు. మద్యం అక్రమంగా విక్రయించినా, బెల్టు షాపులు నిర్వహించినా తోలు తీస్తామంటూ సీఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న ప్రకటనలు ఆచరణలో ఎక్కడా అమలు కావడం లేదు. గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుంది. లాటరీ ద్వారా మద్యం దుకాణాలను దక్కించుకున్న నేతలు సిండికేట్‌గా ఏర్పడి గ్రామాల్లో బెల్టు షాపులు ఏర్పాటు చేసుకుని దండుకుంటున్నారు. క్వార్టర్ బాటిల్‌పై రూ. 20 నుంచి రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. బెల్టు షాపులకు మద్యం దుకాణాల సిబ్బందే బాటిల్‌కు రూ.20 నుంచి రూ.30 వరకు తీసుకుని డెలివరీ చేస్తున్నారు. బెల్టుషాపులు నిర్వాహకులు బాటిల్‌పై రూ.50 వరకు అదనంగా తీసుకుంటూ అమ్ముతున్నారు. జలదంకి మండలంలో 17 పంచాయతీలు ఉండగా, 50కు పైగా గ్రామాలు ఉన్నాయి. మండలంలో నాలుగు మద్యం షాపులు ఉన్నాయి. వాటికి అదనంగా ఒక్కో పంచాయతీలో మూడు, నాలుగు చొప్పున 50కుపైగా బెల్టు దుకాణాలు నడుస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెలుగు తమ్ముళ్లు మద్యాన్నే ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ఊరూరా మద్యాన్ని ఏరులై పారిస్తూ జేబులు నింపుకొంటున్నారు. గత ప్రభుత్వంల అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపగా ఇప్పుడు గ్రామగ్రామానా బెల్టు షాపులు ఏర్పాటయ్యాయి. మరోవైపు మద్యం అక్రమ రవాణా కూడా జోరుగా సాగుతోంది. దీంతో జలదంకి మండలం మరో గోవాను తలపిస్తుందన్న విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. .

24 గంటలు సర్వీస్

ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం మద్యం దుకాణం పక్కన ఎలాంటి దాబాలు ఉండకూడదు. అయితే ప్రతి మద్యం దుకాణం పక్కన దాబాలతో పాటు రెస్టారెంట్‌ను తలపించేలా సిట్టింగ్‌రూములను ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నారు. అందులో వచ్చే లాభాల్లో నెల మామూళ్లు అధికారులకు వెళ్తుండడంతో ఎక్సైజ్, పోలీస్ సిబ్బంది మౌనం వహిస్తున్నారనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. గంజాయి, నాటు సారాపై దాడులు చేశామని చెప్పుకునే అధికారులు బెల్టు షాపులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వేకువ జామున 5 నుండి రాత్రి 12 గంటల వరకు మద్యం అందుతుండడంతో బెల్టు జోరు సాగుతోంది. మద్యం దుకాణాల వద్ద రెస్టారెంట్‌లను తలపించేలా దాబాలు, సిట్టింగ్‌లు ఉండడం వల్ల నిత్యం గొడవలు జరుగుతున్నాయి. మద్యం మత్తులో గొడవలు పడి దాడులు చేసుకుని ఆస్పత్రి పాలైన ఘటనలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో బెల్టు షాపులను తొలగించాలని మహిళలు, యువత తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం

కలిగిరి: మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు పాలూరి మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలోని 23 పంచాయతీలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

గొలుసు అపహరణ

చేజర్ల(ఆత్మకూరు): బైక్‌పై వెనుకగా కూర్చుని వెళ్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును మరో బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులు అపహరించుకెళ్లిన ఘటన చేజర్ల మండలం ఆదూ రుపల్లి వద్ద ఆదివారం జరిగింది. వివరాలు..కలువాయికి చెందిన మేకల అరుణ తన బంధువు బైక్‌పై వెనుకగా కూర్చుని నెల్లూరు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నది. ఆదూరుపల్లి దాటాక వెనుకగా బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులు మహిళ మెడలోని చైన్‌ను గట్టిగా లాక్కుని పరారయ్యారు. ఆమె బైక్‌ను గట్టిగా పట్టుకోవడంతో ప్రమాదం తప్పింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చేజర్ల ఎస్సై తిరుమలేశ్వరరావు తెలిపారు.

భక్తులు ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పించాం

అనుమసముద్రంపేట: రొట్టెల పండగ సందర్భంగా ఏఎస్‌పేటలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాను దర్శించుకునేందుకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా వక్ఫ్‌బోర్డు ఆదేశాల మేరకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించనట్లుగా వక్ఫ్‌బోర్డు ఈఓ హుస్సేన్ ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి భక్తులు అధిక సంఖ్యలో దర్గాను దర్శించుకోనున్న దృష్ట్యా నీడ కోసం షామియానాలతో పాటు క్యూలైన్లు సైతం ఏర్పాటు చేసినట్లు వివరించారు. క్యూలైన్ ద్వారా దర్గాలోకి ప్రవేశించి అమ్మాజాన్, అబ్బాజాన్‌ల సమాధులను దర్శించుకోవాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా పోలీస్ బందోబస్తును సైతం ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తులకు తాగునీరు, భోజన సౌకర్యాలను కల్పిస్తున్నామని చెప్పారు. భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకోవాలన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఆత్మకూరురూరల్: ఆరుగాలం కష్టపడి పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ఆత్మకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని రకాల పంటలు పండించిన రైతులు ఆనందంగా తమ ఉత్పత్తులను విక్రయించుకుని సంతోషంగా ఉన్నారన్నారు. ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ధాన్యం పండించిన రైతులు తమ ఉత్పత్తులను విక్రయించిన 48 గంటల్లోనే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. రెండో పంట సాగు చేస్తున్న రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పొగాకు రైతుల పరిస్థితి మరీ ఘోరంగా తయారైందని, పొగాకు ధరలు పడిపోవడంతో ఒక్కో బ్యారన్‌కు లక్షల రూపాయలను నష్టపోవాల్సి వచ్చిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి పొగాకు ఉత్పత్తులను కొనుగోలు చేసి రైతులను ఆదుకుందని, ఆ దిశగా కూటమి ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి



ఉదయగిరి: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఆదివారం నిర్వహించారు. దీన్‌దయాళ్ చిత్రపటానికి పార్టీ మండల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దీన్‌దయాళ్ మానవతావాదం, శంకరాచార్య జీవితచరిత్ర, వంటి పలు రచనలు చేశారన్నారు. ప్రజాస్వామ్యం, కమ్యూనిజం, సామ్యవాదం, పెట్టుబడిదారీ విధానం వంటి పాశ్చాత్య భావనలపై భారతదేశం ఆధారపడకూడదన్న దీన్‌దయాళ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నా రు.

గడ్డివామి దగ్ధం

అల్లూరు: ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధమైన ఘటన స్థానిక తూర్పువీధిలోని మారుతీకాలనీలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. మారుతీకాలనీకి చెందిన పిల్లి నాంచారమ్మ పశువుల మేత కోసం 15 ఎకరాల్లోని గడ్డిని వామిగా వేసుకుంది. శనివారం రాత్రి గడ్డివామికి ప్రమాదశాత్తు నిప్పు అంటుకుని మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. కాగా బాధితురాలు ఆదివారం అల్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

సోమశిల: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో ఈ నెల 8న దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతి వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని అనంతసాగరం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బిజివేముల పిచ్చిరెడ్డి వైఎస్సార్సీపీ శ్రేణులకు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మండలంలోని ప్రతి పంచాయతీలో వైఎస్సార్ విగ్రహాల వద్ద నివాళులర్పించి సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో కామాక్షిదేవికి సారె సమర్పణ



సంగం: స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయంలో కొలువైన కామాక్షిదేవికి ఆషాఢ మాసం సందర్భంగా భక్తులు ఆదివారం సారెను సమర్పించారు. భక్తులు సారెతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. అమ్మవారిని పండ్లు, కూరగాయలతో శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు, చండీ హోమం నిర్వహించారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్



కావలి: జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కావలి (జలదంకి): అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన గొప్ప వ్యక్తి బాబూ జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పందిటి కామరాజు కొనియాడారు. మాజీ ప్రధాని జగ్జీవన్‌రామ్ వర్ధంతిని కావలి పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పందిటి కామరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడిగా, సంఘ సంస్కర్తగా, కేంద్ర మంత్రిగా ఆయన దేశానికి అందించిన సేవలను శ్లాఘించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గంధం ప్రసన్నాంజనేయులు, దయాకర్‌రెడ్డి, చెన్ను ప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, పరుసు మాల్యాద్రి, వాయిల తిరుపతి, కొమారి రాజు, డేగా రామయ్య, కుందుర్తి కామయ్య, చైతన్య, ఆత్మకూరి రాజేష్, ఎస్‌కే వల్లి, నాగేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



కనుపూరుపల్లిలో బోరు డ్రిల్లింగ్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

ఆత్మకూరురూరల్: మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి తెలిపారు. మండలంలోని నల్లపరెడ్డిపల్లి, కనుపూరుపల్లి గ్రామాల్లో జెడ్పీ నిధులతో బోర్ల ఏర్పాటు పనులను స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని బోయలచిరివెళ్ల, జంగాలపల్లి, మహిమలూరు, పమిడిపాడు, ఆరవీడు, నల్లపరెడ్డిపల్లి, వాశిలి, బట్టేపాడు, అప్పారావుపాళెం, కనుపూరుపల్లి పంచాయతీల పరిధిలో ఇప్పటికే పది బోర్లు మంజూరు చేయించామన్నారు. ఇంకా అవసరమైతే రెండో విడత మంజూరు చేయిస్తామన్నారు. బోర్ల మంజూరుకు సహకరించిన జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ బొడ్డు సుహాసిని, సర్పంచ్‌లు దొడ్ల శ్రీదేవమ్మ, రాచగొర్ల ఆదిలక్ష్మమ్మ, నాయకులు బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి, ఏడెం పెంచలరెడ్డి, సుధాకర్ రెడ్డి, దొడ్ల వెంకురెడ్డి, రాచగొర్ల శంకరయ్య, యర్రగుంట్ల పెంచలయ్య, చంద్రా ప్రసాద్, శీనయ్య, కనకాద్రి, పాణెం పెంచలయ్య, వినయ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

రేబీస్ వ్యాధిపై అవగాహన



కుక్కకు టీకా వేస్తున్న ఏడీ మహేశ్వరయ్య

అల్లూరు: ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అల్లూరులోని పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాక్సిన్లను ఆదివారం ఉచితంగా వేశారు. అనంతరం పశుసంవర్థక శాఖ సహాయసంచాలకులు ఏ మహేశ్వరయ్య పశువుల నుంచి మనుషులకు సంక్రమించే జూనోటిక్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పెంపుడు జంతువుల ఆరోగ్యం, పరిశుభ్రతపై సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే వ్యాధుల బారినపడే ముప్పు ఉందన్నారు. కుక్కకాటు ద్వారా రేబీస్ వస్తుందన్నారు. 135 ఏళ్ల క్రితం రేబీస్ లక్షణాలున్న కుక్క మనిషిని కరిస్తే చనిపోయేవారన్నారు. 1885 జూలై 61న లూయీ పాశ్చర్ ప్రాణాతకమైన రేబీస్‌కు టీకాను కనిపెట్టి ఎందరికో ప్రాణదాతగా మారారని తెలిపారు. దానికి గుర్తుగా ఏటా జూలై 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని జరుపుకొంటున్నామని వివరించారు. పెంపుడు కుక్కలకు ఏటా తప్పనిసరిగా రేబీస్ వ్యాక్సిన్‌ను వేయించాలని సూచించారు.

ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడికి సత్కారం



వింజమూరు(ఉదయగిరి): కలిగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ గత నెల 30న ఉద్యోగ విరమణ పొందిన మేకల మాలకొండయ్య ఉద్యోగ విరమణ సభను వింజమూరులోని వీఆర్ ఫంక్షన్ ప్లాజాలో ఆదివారం నిర్వహించారు. కలిగిరి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం ఆధ్వర్యంలో మాలకొండయ్య దంపతులను సహచర ఉపాధ్యాయ సిబ్బంది శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయుడిగా ఆయన అందించిన సేవలను కొనియాడారు.

బాకీ విషయంలో ఘర్షణ- ఇద్దరికి తీవ్ర గాయాలు





గాయపడిన మద్దినేని రామస్వామి, హుస్సేనయ్య

సీతారామపురం : బాకీ విషయంలో ఇరువురు వ్యక్తులు ఘర్షణ పడి తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలోని పబ్బులేటిపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. పబ్బులేటిపల్లి గ్రామానికి చెందిన మద్దినేని రామస్వామి తన బంధువైన పోరుమామిళ్ల హుస్సేనయ్యకు రూ.50 వేలు అప్పుగా ఇప్పించాడు. ఆదివారం బాకీ విషయంలో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో హుస్సేనయ్య ఫూటుగా మద్యం సేవించి పొలంలో పనిచేసుకుంటున్న రామస్వామిపై గడ్డపారతో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని ఉదయగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



గండిపాలెంలో శివుడికి అభిషేకం చేస్తున్న భక్తులు



ఆత్మకూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణ ప్రజలు తొలి ఏకాదశి పర్వదినాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలోని ఆండాల్ లక్ష్మీ సమేత వెంకటేశ్వరస్వామి, అలఘనాథస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి శ్రీవారిని దర్శించుకున్నారు. వెంకటేశ్వర స్వామి ఆలయంలో దేవదేవేరుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

విశేషాలంకారంలో ఇష్టకామేశ్వరిదేవి

సీతారామపురం : మండలంలోని ప్రాచీన శైవ క్షేత్రమైన ఘటిక సిద్ధేశ్వరంలో తొలి ఏకాదశి సందర్భంగా ఇష్టకామేశ్వరిదేవి అమ్మవారు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పరమశివుడితో పాటు ఇష్టకామేశ్వరిదేవిని దర్శించుకుని పూజలు చేశారు.

ఉదయగిరి రూరల్: మండలంలోని ఆలయాల్లో తొలి ఏకాదశి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గండిపాళెం, ఉదయగిరి, యర్రబల్లిగడ్డ, గుడినరవ, అప్పసముద్రం, తదితర గ్రామాల్లోని శివాలయాలు, రామాలయాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

ఆత్మకూరు: ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన బట్టేపాడు కాలనీలో చోటు చేసుకుంది. వివరాలు..బట్టేపాడు కాలనీకి చెందిన రాపూరు సుబ్రహ్మణ్యం (46)కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల భార్య చనిపోయింది. సుబ్రహ్మణ్యం మూడ్రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఆ తరువాత ఇంటికి వెళ్లలేదు. ఈ నేపథ్యంలో కాలనీ సమీపంలోని బావిలో సుబ్రహ్మణ్యం మృతదేహాన్ని స్థానికులు ఆదివారం గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. కాగా సుబ్రహ్మణ్యం అప్పుడప్పుడు బావి గట్టుపై కూర్చుని ఉంటాడని, ప్రమాదవశాత్తు బావిలో జారిపడి మృతి చెందినట్లుగా పోలీసుల విచారణలో తెలిసినట్లుగా ఎస్సై సాయిప్రసాద్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వేడుకగా పీర్ల గ్రామోత్సవం



సీతారామపురంలో పీర్ల ఊరేగింపు



అల్లూరులో అన్నదానం

సీతారామపురం : మండలంలోని సీతారామపురం, నారాయణప్పపేట, ఎగువపాళెం, పబ్బులేటిపల్లి, తురకపాళెం గ్రామాల్లో నాలుగు రోజులుగా జరుగుతున్న మొహర్రం కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. చివరిరోజు వేకువన పీర్ల ఊరేగింపును నిర్వహించారు. సీతారామపురంలోని మెయిన్ బజారులో ఇరు గ్రామాల పీర్లు ఎదురుపడి 'సలాం' అందుకున్నాయి. సాయంత్రం అగ్నిగుండాలను మూసివేసి పీర్లను స్నానాల కోసం బావుల వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ క్రమంలో మరోమారు ఇరు గ్రామాల పీర్లు ఎదురుపడి సలాం అందుకున్నాయి. అనంతరం అల్విదాయో చదువుతూ దివిటీల వెలుతురు నడుమ పీర్లను ఆయా గ్రామాల్లోని పీర్ల చావీడుల వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పీర్ల గ్రామోత్సవానికి ఉదయగిరి సీఐ వెంకట్రావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా యౌమే ఆషురా

ఉదయగిరి రూరల్: స్థానిక ఆస్థాన ఖాదరియలో మొహర్రం పదోరోజు సందర్భంగా యౌమే ఆషురా కార్యక్రమం నిర్వహించారు. అఖిల భారత సూఫీ సజ్జదా నషీన్ కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అహ్మద్‌బాషాఖాలిది మాట్లాడుతూ మొహర్రం సందేశాన్ని అందజేశారు. జిల్లా మైనార్టీ నాయకుడు రియాజ్, ఉదయగిరి ఎంపీటీసీ యస్దానీ మస్తాని, ఖాదరియా అస్థాన ముఖ్యులు మిఠాయిగిరి అహ్మద్, ఫరుద్దీన్, నజీర్, తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల(ఆత్మకూరు): చేజర్లలో మొహర్రం షహదత్‌ను పురస్కరించుకుని ప్రత్యేకంగా అలంకరించిన చప్పరంలో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

మర్రిపాడు: నందవరంలో ఆదివారం వేకువజామున పెద్దపీర్ల ఊరేగింపును నిర్వహించారు. భక్తులు అగ్నిగుండం తొక్కి తమ భక్తిని చాటుకున్నారు. సమీప గ్రామాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

అల్లూరు: మొహర్రం సందర్భంగా స్థానిక మసీద్ సెంటర్‌లోని పీర్ల చావడి వద్ద ఆదివారం అన్నదానం నిర్వహించారు. చివరిరోజున పీర్ల చావడి వద్ద ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో మొహర్రం సందేశాన్ని ఇస్తున్న అహ్మద్‌బాషా ఖాలిది



చేజర్లలో..

ఔషధాల నేరేడుతో ఆరోగ్యం మెండు



నేరేడు పండ్లు

సీతారామపురం : ప్రకృతి ప్రసాదించే పండ్ల జాతుల్లో ఆరోగ్య ఫల ప్రదాయినిగా పిలిచే నేరేడు పండ్ల సీజన్ వచ్చేసింది. ఇవి రక్తాన్ని శుద్ధి చేసే ఔషధ విలువలు, శరీరానికి అవసరమైన పోషకాలను అందించి ఎంతో మేలు చేకూరుస్తాయి. నేరుడు పండ్లు తినడానికి కొంచెం తియ్యగా, కొంచెం వగరుగా ఉంటాయి. వీటిని ఆయుర్వేద శాస్త్రంలో ఆపద సంజీవనిగా పిలుస్తారు. వీటిలోని ఆక్సాలిస్ ఆమ్లం ఒక ప్రత్యేకమైన రుచిని అందిస్తుంది. ఈ పండు శరీరంలో ఏర్పడే అనేక రుగ్మతలను దూరం చేస్తుంది. నేరేడు పండు మాత్రమే కాకుండా దాని చెట్టు ఆకులు, బెరడు కూడా శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అత్యధిక పోషకాలు ఉన్న నేరేడు పండును ఆరోగ్య పానీయాలు, జామ్‌లు, ఐస్‌క్రీమ్‌లు తదితర రూపంలోనూ తీసుకోవచ్చు. నేరేడు కాయలను వెనిగర్ వైన్ తయారీలోనూ ఉపయోగిస్తారు.

విటమిన్లు పుష్కలం

నేరేడు పండ్లలో ఐరన్, కాల్షియం, పొటాషియంతో పాటు ఏ, సీ విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. వీటివల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షణ పొందవచ్చు. ఇవి మూత్ర సమస్యల నియంత్రణతో పాటు మధుమేహాన్ని అదుపులో ఉంచి కిడ్నీలను శుభ్రం చేస్తాయి. మూత్రశయంలోని ఇన్ఫెక్షన్లను సైతం తగ్గిస్తాయి. కాలేయాన్ని శుభ్రపరిచి దాని పనితీరును మెరుగుపరుస్తుంది. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు గుండె, మెదడుకు దివ్య ఔషధంగా పనిచేస్తాయి. దంతాలు, చిగుళ్లు ఆరోగ్యకరంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తస్రావాన్ని తగ్గించి నోట్లోని చెడు బ్యాక్టీరియాను నశింపజేసి దుర్వాసన రాకుండా చేస్తుంది. కడుపులో పేరుకుపోయిన మలినాలను బయటకు పోవడానికి, పేగుల్లో చుట్టుకుపోయిన వెంట్రుకలను కరిగించడానికి నేరేడు పండు ఎంతగానో దోహదపడుతుంది. నేరేడు పండ్లలో విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. శరీర భాగాల్లో గాయాలైతే నేరేడు ఆకులను కట్టుగా కట్టి రక్తం కారకుండా నిలుపుదల చేయవచ్చు. చెట్టు ఆకులు కూడా విషాన్ని పీల్చుకునే గుణాన్ని కలిగి ఉంటాయి. పొట్టలో ఉండే నులిపురుగులను సైతం నివారిస్తుంది. నోటి కేన్సర్ నివారణలో కూడా ఎంతో దోహదపడుతుంది. మధుమేహ వ్యాధి పీడితులకు నేరేడు పండు ఒక వరంగా చెప్పొచ్చు. గింజలను పొడి చేసుకుని ప్రతిరోజు నీటిలో మరగబెట్టి వడగట్టి తాగితే శరీరంలో చక్కెర నిల్వలు అదుపులో ఉంటాయి. అతిసార రోగులకు సైతం ఈ నేరేడు పండ్లు చాలా మంచి ఔషధం. ప్రతి ఒక్కరూ ఏడాదికి కనీసం 20 పండ్లు తింటే మంచి ఫలితాలు ఉంటాయి. ఇవి శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారిస్తాయి. అన్ని వేళల్లో ఆరోగ్యానికి నేరేడు పండు భరోసా కల్పిస్తుంది.

ఆరోగ్యానికి మంచిది



కాలానుగుణంగా వచ్చే పండ్లను తినాలి. వర్షాకాలం ప్రారంభ సమయంలో వచ్చే నేరేడు పండ్లను తినడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇందులోని ఔషధ గుణాలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. పండుకు విషాన్ని హరించే శక్తి సైతం ఉంది .చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ నేరేడు పండ్లను తినవచ్చు.

–స్వప్నారెడ్డి, వైద్యాధికారిణి, సీతారామపురం

ఆధార్ నమోదుకు పాట్లు

ఆత్మకూరురూరల్: మండలంలోని ఆధార్ నమోదు కేంద్రాలు రెండు నెలలుగా పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో బట్టేపాడు, నెల్లూరుపాళెం, ఇరిగేషన్ సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఉండగా, అక్కడి యంత్ర సామగ్రి పాడైపోవడంతో సమస్య తీవ్రత పెరిగింది. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆధార్ నమోదు కోసం అనంతసాగరం మండలం రేవూరు సచివాలయానికి వ్యయప్రయాసలకోర్చి వెళ్లాల్సి వస్తోంది. ఈ విషయమై ఆత్మకూరు తహసీల్దార్ పద్మజాకుమారిని సంప్రదించగా తాను ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించానని ఆత్మకూరు ఎంపీడీఓతో ఈ విషయమై చర్చించామన్నారు. ప్రస్తుతం సచివాలయ ఉద్యోగుల బదిలీలు జరుగుతున్నందున త్వరలోనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.